# స్వశక్తి

## -కప్పగంతుల మల్లికార్జునరావు

"సెక్రటరీ గారూ! యీ ఫైలు నా ప్రాణమని మీకు తెల్సు. నా ప్రాణమంటే ఎవరు? నా వొక్కగానొక్క కొడుకు. నేను రాయమన్నదేమిటి? మీరు రాసిందేమిటి?''

మంత్రి కొడుకు స్కూల్లో రౌడీ. హెడ్‌మాస్టర్‌పై తిరగబడి కొడ్తే, టీసి యిచ్చి పంపేడు.

''స్కూలు ప్రజలది. ప్రజల నాయకుడ్నైన నాది. నా స్కూలు నుంచి నా కొడుకును పంపించే హక్కు వీడికెక్కడిది?'' అని మంత్రిగారు గర్జించి హెడ్‌మాస్టర్‌ను సస్పెండ్ చేయించాడు. హెడ్‌మాస్టర్ చేసుకున్న అప్పీల్ యిప్పటికి కార్యదర్శి దగ్గరికొచ్చింది.

''మీరు వింటానంటే మీకో చిన్న కథను చెప్తాను సర్. ఆ తర్వాత ఫైల్‌ను గురించి మాట్లాడుకొందాం.''

''అయితే చెప్పు. రేపు నేను జనానికి కథలు చెప్పాలంటే కథలు వినాలిగా?''

''మనకు స్వాతంత్రం రాకముందు సంగతి. ఒక జమీందారుగారు వొక చిన్న ప్రాంతానికి రాజులా వుండేవారు. అతను పరమలోభి. అహంకారి, కోపిష్టి.

అతని కొడుకు తండ్రికన్నా మూర్ఖుడు. అహంభావి.

కొడుకును చదువుకోసం స్కూళ్లకు పంపటం స్టేటస్‌కు భంగంగా భావించాడీ జమిందారు. తక్కువ జీతాలిచ్చి టీచర్లనే తన భవనానికి పిలిపించాడు. ఆ టీచర్లు రాజాశ్రయం దొరకటమే భాగ్యమనుకొన్నారు. రాజుగారి పిసినారి తనానికి, కొడుకు అహంభావానికి తలవంచి పబ్బం గడుపుకొన్నారు. కొడుక్కి అక్షరం ముక్క రాలేదని తెల్సుకొని మండిపడి జమీందారు పాత పంతుళ్లను యిళ్లకు పంపి, కొత్త పంతులు కోసం వెతికాడు.

వెతకంగా వెతకంగా దీక్షితులు ఆయన కళ్లపడ్డాడు. అతను తన కొడుక్కి నాలుగు ముక్కలు నేర్పగల సామర్థ్యం వున్నవాడని తెల్సుకొన్నాడు.

దీక్షితులు జీతం ఏమీ తీసుకోకుండానే జమీందారు కొడుక్కి చదువు చెప్తానన్నాడు. కానీ జమీందారు కొడుకు తన దగ్గరికి వచ్చి విద్య నేర్చుకోవాలి. జమీందారు, ఆయన కొడుకు కూడా కొన్ని నియమాలను



పాటించాలి అని కండీషన్ పెట్టేడు.

ఖర్చులేని చదువు కదా అనుకొని జమీందారు కండీషన్లకు అంగీకరించాడు.

మందీ మార్బలంతో జమీందారు కొడుకు చదువుకని ఆయన యింటికి వెళ్లాడు.

''చదువుకొనేది నీవైతే వాళ్ళంతా ఎందుకు?''

''వాళ్ళు మా కుటుంబ హోదాను, హుందాను నిలపటానికి అవసరమైన లాంఛనాలు. వాళ్లు వస్తే మీకేం నష్టం''

దీక్షితులు తను క్రింద కూర్చొని అతడిని కింద కూర్చోమన్నాడు. జమీందారు కొడుకు మొదటిరోజు బాధపడ్డాడు. రెండోరోజు అతనివెంట ఆసనాన్ని మోసుకొచ్చేరు పరిచారకులు.

గురువు నేలమీద, శిష్యుడు ఎత్తైన సుఖాశనంపైన.

మూడోరోజు జమీందారు కొడుకు గంట ఆలస్యంగా వచ్చాడు.

''పదిహేను నిముషాలు గోడకుర్చీ వెయ్యి''

''శిక్షలు విధించే అధికారం మా కుటుంబానిది. నాకు శిక్ష విధించే అధికారాన్ని మా నాన్నగారు మీకివ్వలేదు. నేను వెయ్యను'' కొడుకు దురుసుగా అనేసి వెళ్లిపోయాడు.

మర్నాడు జమీందారు కుమారుడు వచ్చేసరికి తలుపు వేసి వుంది. కోపం వచ్చి పరివారం చేత తలుపు పగలగొట్టించాడు. లోపల దీక్షితులు లేదు. వెళ్లి జరిగిందంతా తండ్రితో చెప్పేడు. జమీందారు మాట్లాడలేదు. అంతా దీక్షితులపని యిక 'గోవిందా' అనుకున్నారు.

కొడుకుని తీసుకొని ఎలాంటి రాజలాంఛనాలు లేకుండా ఆ మర్నాడే దీక్షితులు యింటికెళ్లేడు జమీందారు. ఆయనకు తను పాదాభివందనం చేసి కొడుకు చేత చేయించాడు.

''మూడు రోజుల్లో మీరు మూడు గొప్ప పాఠాలను నా కొడుక్కే కాదు. నాకూ చెప్పేరు. విద్యార్థి, అందునా పాలకుడు కాబోయే విద్యార్థికి, వుండవల్సిన ప్రాథమిక లక్షణాలను చెప్పేరు. అతడి అహంకారాన్ని తగ్గించుకోవాలి. సమానభావాన్ని పెంచుకోవాలి. కాలం విలువను గ్రహించాలి. నేను ఊహించింది నిజమే కదా గురువుగారూ?''

దీక్షితులు తల ఊపేడు.

''ఇకనుంచి వాడు మీ యింట్లో, మీరు పెట్టింది తిని, చెయ్యమన్నది చేసి, చదువుకొంటాడు. నా వంశగౌరవం, హుందా.. వీటన్నిటికన్నా నాకు నాకొడుకు భవిష్యత్తు ముఖ్యం. రానున్నకాలంలో అశాశ్వతమైన సంపద, హోదాలాంటి వాటికన్నా స్వశక్తికి ప్రాధాన్యత వుంటుందన్న హెచ్చరిక నాకు విన్పిస్తున్నది. విద్య ద్వారా వాడికి స్వశక్తిని ప్రసాదించండి.''

కార్యదర్శి కథను చెప్పటం ఆపేసాడు.

''కథలో నీతి బాగుంది. కానీ కొడుకు ఏమయ్యాడు? గురువు ఆ మూర్ఖుడిని విద్యావంతుడిని చేయగలిగేడా?''

''విద్యతో పాటు అతని వ్యక్తిత్వాన్ని కూడా తీర్చిదిద్దేడు. అతనికిప్పుడు ధర్మం ప్రాణం''

''నేన్నమ్మను. అతను నీకెలా తెల్సు?''

''ఆ జమీందారు కొడుకు నేనే కనుక!''

★